**ఉన్న ఊరు పల్లెటూరు కావటంవల్ల చేసేది బడిపంతులు ఉద్యోగమైనా నాలుగు రాళ్ళు సంపాదిస్తూ సంసారం నెట్టుకొస్తున్న రామనాథం హఠాత్తుగా కాలధర్మం చెందాడు. అంతటితో ఆ సంసారం వీధిని పడింది.**

# కాకులు



పురాణం సూర్యప్రకాశరావు

రామనాథానికి ఇద్దరు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలూను. ఒక్క పెద్దవాడు తప్పించి మిగతా ముగ్గురు పిల్లలు వయస్సులో చిన్న వాళ్ళయినా బుద్ధికి మటుకు వాడికంటె పెద్దనే చెప్పాలి. ఎందుకంటె వయస్సుకు తగిన తెలివి తేటలు వాళ్ళకయితే అబ్బినవికాని వాడికి మటుకు అబ్బలేదు. రోజులు దొర్లుతున్నకొద్దీ వాడిలో శారీరకమైన మార్పేకాని మానసికమైన మార్పు స్తంభించిపోయింది. ఉత్తి అమాయ కుడు, బుద్ధి సూక్ష్మత లేనివాడూను.

పాపం రామనాథం జీవితంలో ఈ ఒక్క సమస్యా తనని ఎంతో వ్యధలపాలు చేసింది. కొడుకు చేతికంది

> సాంఘిక దురాచారాలు మూఢ నమ్మకాల వలన మన కుటుంబాలలో ఎటువంటి అపకారాలు జరుగుతాయో, శ్రేయోభిలాషులైన బంధువులే కష్ట కాలంలో అందవలసిన సహాయం అందనివ్వ కుండా చేస్తారో బలంగా చెప్పిన కథ 'కాకులు'! ఈ కథను నేషనల్ బుక్ ట్రస్ట్ ఢిల్లీవారు భారతీయ భాష లన్నిటిలోనూ అనువదించి ప్రకటించారు.
>
> ఎడిటర్

తనని సుఖపెడతాడనే ఆశని అతను బలవంతాన చంపుకుని ఆలోచిస్తే కంటిముందు భీకరమైన దరిద్ర దేవత బీభత్స నృత్యం కనిపించింది. తనదీ అని చెప్పకుందుకు ఓ బారెడు భూమి కూడా లేదు. తనకి మిగిలిందల్లా భార్యా పిల్లలూ, పక్షి రెక్కల్లా ఈ రెండు హస్తాలూను. ఇవే వున్నాయి అనుకునేవాడు.

తన తర్వాత ఈ సంసారం ఏమైపోవాలి? అన్న ప్రశ్న యెప్పుడైనా మనసులో రేకెత్తితే అతను నిలువునా కృంగిపోయేవాడు. అయితే పైకి మటుకు గంభీరంగా మసులుకొనేవాడు. ఎవరితోనూ బేలగా అంగలార్చేవాడు కాదు. నాకేం కొరత? నా పిల్లలలే నాకు పదివేలు అంటూండేవాడు. వాళ్ళందర్నీ చుట్టూతా కూర్చోబెట్టుకుని ఇలా ఆ సంసారం గుంభనంగా యిన్నాళ్ళూ సాగిపోయింది.

ఉన్నట్టుండి మంగళవారం ''జ్వరం వచ్చినట్టుంది'' అన్నాడు భార్యతో. ఆమె ఏదో యింట్లో వున్న మందే వేసింది. ఈ యింట్లో కాపరం పెట్టిన పాతిక సంవత్సరాలలోను పిల్లలకేమిటి, పెద్దలకేమిటి స్వంతంగా తయారు చేసుకున్నవో, కొని తెచ్చుకున్న మందులో ఉపయోగిస్తూండేవాడు ఆయన. డాక్టరంటూ ఒకర్ని పిలవటం, అతగాడు తనని నిలువునా దోపిడీ వెయ్యటం అతనికి యిష్టం వుండేది కాదు.

మామూలుగా త్వరలో తగ్గిపోతుందనుకున్న జ్వర

మధ్యాహ్నానికి మనిషినే మింగేసింది.

ఎంత ఘోరం జరిగింది అనుకున్నారంతాను.

** ** **

మధ్యాహ్నం పదకొండు గంటలకి పోయిన మనిషి శవం రాత్రి చీకటి పడేవరకూ దహనం వెయ్యటానికి ఏల్లేక పోయింది. కారణం మహాలక్ష్మి అందుకు అడ్డు చెప్పటమే. బంధువులు చాలా మందికి టెలిగ్రాంలు ఇప్పించారు. ఈ పాటికి వస్తుంటారు అంటూ జాలిగా ప్రాధేయపడింది. ఆ రాత్రి ఆఖరి బస్సులో కూడా ఎవరూ రాలేదు. మర్నాడు ఉదయం వరకూ ఉంచమని ఆవిడ ప్రాధేయపడిందికాని ఊరు పెద్దలు అంగీకరించలేదు.

ఇటువంటి సందర్భాలలో పల్లె ప్రజలలో కొన్ని పట్టింపులూ, కట్టుబాట్లు యిప్పటికీ యింకా కనిపిస్తూనే వుంటాయి. ఒక యింట్లో కాపరం వుంటూన్న వాళ్ళ గోనే ఒక వాటాలో యిలాంటి దుస్సంఘటన జరిగిం దనుకోండి-పట్నవాసాల్లో అయితే గప్‌చిప్‌గా వీధి తలుపు గడియవేసి లోపల వంట చేసుకుంటారు. పల్లెటూళ్ళలో అలా కాదు. శవం వీథిలోంచి కదిలేవరకూ ఎవరూ ఆ వీథిలో వంట వెయ్యరు. పొయ్యిలో నిప్పే వెయ్యరు.

ఆ రాత్రే శవం దహనం పూర్తి చేశారు. చలి ఎముకలు కొరికేస్తూంది. ఈదురుగాలి వీస్తూంది. ఆ రాత్రి చాలా సేపటి వరకూ ఎవరిళ్ళ ముందు వారు చేర్చుని ఆయన గుణగణాల గురించే చెప్పుకున్నారు.

వీథి గదిలో గోడ నానుకుని లోపల్లోపల కుమిలి కుమిలి ఏడుస్తున్న మహాలక్ష్మికి అర్ధరాత్రి ఒంటి గంట వరకూ వీథిలోంచి నిట్టూర్పులు, భర్తను గురించి ప్రశంసా వాక్యాలు స్పష్టాస్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి. ఆవరికి మరో అర్థం గంటలో ఊరు ఊరంతా నిద్ర పోయి నిశ్శబ్దత ఆవరించింది.

గూట్లో ప్రమిదలో దీపం మినుకు మినుకుమని వెలుగుతోంది. పిల్లలంతా ఏడ్చి ఏడ్చి పడుకున్నారు.

భర్తని గురించి తలపోస్తూ ఆమె పొంగి పొంగి వచ్చే దుఃఖాన్ని అతి ప్రయత్నం మీద అణచుకుంటూంది. 'నయన్ని వుంచి నన్ను తీసుకు పోలేక పోయావా దేముడా?' అంటూ మొత్తుకుంది-సాధారణంగా, అటు వంటి సందర్భాల్లో అందరూ అనుకునేట్టుగానే.

మధ్య మధ్య ఒక్క కునుకుపట్టినా యేవేవో పీడ కలలు వచ్చి నిద్ర చెడగొడుతూనే వున్నాయి. ఏవేవో ఆలోచనలు రభస పెడుతూనే వున్నాయి. ఇక తన బతుకే ఓ అఖాతం! నిన్నటివరకూ వూహించిన భవిష్యత్తు పెద్దపులిలా అనుభవానికి వచ్చింది. ఇప్పుడు అన్నీ సమస్యలే. పరిస్థితులన్నీ ఒక్కసారిగా ఎదురు తిరిగాయి. పసిపిల్లలవైపు బాధగా చూసింది. చలికి ముడిచి పెట్టుకుని పడుకున్నారు. తండ్రి చనిపోతే వాళ్ళూ ఏడ్చారు. అంతా ఏడుస్తూంటే వాళ్ళూ ఏడుపురుమన్నారు. అంతకు తప్పించి వాళ్ళకేమీ తెలియదు. అదే మంచిది. మధ్య మధ్య వాళ్ళు తండ్రి ప్రస్తావన తెచ్చినా ఏదో సర్ది చెబితే యిట్టే మరిచి పోతారు. తను? జీవిత పర్యంతం ఆ జ్ఞాపకాలతో కుంగిపోవాల్సిందే.

# ముత్యాలసరాలు

చాలాసేపు భర్తని తలుచుకుని లోపల్లోపల వెక్కి వెక్కి ఏడ్చింది. మిగతా సగం రాత్రి భవిష్యత్తు గురించి వలవలా ఏడ్చింది. బట్టతల, లాల్చీ, పంచె, బుజం మీద కండువా, నుదుట మచ్చ, లోతుకు పోయిన కళ్ళు, ఆకు చెప్పులు, కళ్ళద్దాలు, చేతిలో గొడుగు-అవన్నీ స్మృతిపథంలో గిరగిరా తిరిగాయి. భవిష్యత్తులోకి దృష్టి



*'జీవన గంగ' ప్రకాశరావుగా ప్రఖ్యాతిగాంచిన పురాణం సూర్యప్రకాశరావు, ఆచంట జానకిరామ్, మహీధర రామమోహనరావు, డాక్టర్ కొమ్మూరి వేణు గోపాలరావు, హితశ్రీ, బలివాడ కాంతారావు, కాళీపట్నం రామారావు, మసూనా, రావిశాస్త్రి, లత-వీరికి సన్నిహితులు, సమకాలికులు. నార్ల చిరంజీవి, డాక్టర్ సంజీవదేవ్, శారదలకు బాగా తెలుసు. నవలా రచనలోను, కథా రచనలోనూ తనదైన ప్రత్యేకమైన ఒరవడిని సృష్టించుకున్న ప్రకాశరావు సుమారు వందకు పైగా కథలు, అరడజను నవలలు రాశారు. ఈయన మంచి చిత్రకారులు కూడా. జననం 15-5-1934, మరణం: 20-11-1987. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో కాగితపు పల్లకి, కాంతా కనకాలు నవలలు, తొమ్మిది దాకా కథలు వ్రాశారు.*

సారిస్తే అంతూ దరీలేని అఖాతం అంచున నిలబడ్డట్టుగా మనసు బెంబేలు పడింది. కళ్ళు మసకలు కమ్మి నెత్తి మీద కప్పు కంటికి కనిపించలేదు. మనసంతా ఏదో తెలియని బెంగతో అవ్యక్తంగా కుమిలిపోయింది. నలుగురు పిల్లలు, తను...అయిదు పొట్టలు నిండాలి. ఎలా? ఎంత గౌరవంగా బ్రతికిన కుటుంబం? ఎవర్నీ ఏ విషయంలోనూ ఆత్మ కాల్చుకుని చెయ్యి చాపలేదే? తనిప్పుడేం చెయ్యాలి?

ఆ చెయ్యాలిసిందేమిటో మనసులో అనేక రకాలుగా ఆలోచించింది. కొద్ది గౌరవం అయిన వృత్తి దేనికైనా డబ్బు మూలం. అది లేందే ఏదీ కాదని తనకి తెలిసివుండి తనేదో గౌరవంగా బ్రతికే ఆస్కారం వుందనుకోటం ఆమెకే అపసవ్యంగా తోచింది.

భద్రమ్మగతి ఏమయింది? పాతికేళ్ళ వయసులో భర్త చనిపోయాడు. అప్పటికే ముగ్గురు పిల్లలు. ఏం చేసింది? ఏం చేసింది? మహాలక్ష్మి దుఃఖం ఆపుకోలేక పోయింది. తనకీ అదే గతి పట్టబోతోందా? ఇంతకాలం పరువుగా బ్రతికిన సంసారం వీథిన పడితే ఎవరూ పట్టించుకోరా? ఎవరికీ అవసరం లేదా? భద్రమ్మలా యింటింటికీ తిరిగి బియ్యాలూ, పప్పులూ దంచి బాగు చేస్తేకాని తనకి రోజులు గడవ్వా? ఒకప్పుడు ఈ ఊళ్ళో ఆమెకున్న గౌరవం ఎవరికీ తీసిపోయేది కాదు. అందరి మాస్టరుగానే భద్రమ్మ సమాన స్థాయిలో నిలబడింది. కాని యిప్పుడు? ఏదో ఎప్పుడైనా తప్పించి ఆవిడ్ని గురించిన ప్రస్తావన ఎవరూ తీసుకు రారు. ఒకవేళ వచ్చినా మునుపటి ధోరణిలో వుండవు ఆ మాటలు.

ఈ మధ్య ఆమెకు సుకుమారం ఎక్కువైందని, ఏ పని చేసినా శుభ్రంగా వుండటం లేదని, ఒకటికి పదిసార్లు చెబుతే కాని ఏదీ వినిపించుకోవటం లేదని, అయినా బ్రతికి చెడిన మనిషి కాబట్టి పిల్లల ముఖం చూసి జాలిపడి ఔదార్యం చూపిస్తున్నామని- ఇలాగుం టుంది ధోరణి. ఆమె మునుపటి అంతస్థుని కోల్పో యింది. బాధ్యత ఆమెది కాదు. రెండు బలిష్ఠమైన చేతులు ఆ సంసారాన్ని గుప్పెటలో మూసి రక్షించాయి. ఆ చేతులు అదృశ్యమయిపోయాయి-కొండ నావరించిన మంచులా. మంచు కరిగింది. గుప్పిటలో లొసుగు బట్టబయలయింది. తనని గురించి ఆమె గురించి అనుకున్నట్టుగానే అనుకుంటారు. తనున్నది అద్దె కొంప్పని, కొద్ది రోజుల్లోనే అంత పెద్ద కొంపకు తను స్వస్తి చెప్పాల్సిన అవసరం వుంటుందని తోచగానే మహాలక్ష్మికి మనో నేత్రం ముందు, చెట్టుకింద ఎండనక వాననక గడ్డి పరకల్లా నివసించే గర్భ దరిద్రులు వెన్ను నంటుకుపోయిన కడుపులతో, లోతుకుపోయిన కళ్ళతో, అట్టలు కట్టిన వెంట్రుకలతో బీభత్సంగా కనిపించారు. గోడకి చారబడి బలవంతంగా దుఃఖాన్ని ఆపుకుని పెదాలు బిగపట్టి కళ్ళు మూసుకుంది.

ఆమె చెంపలు చెరువయిపోయాయి. మనస్సు సముద్రంలా ఘోష పెడుతూంది. కళ్ళు తెరిచేసరికి ఆమె దృష్టి పెద్దవాడిమీద పడింది. వాడూ పసిపిల్లల వారనే ముడుచుకుపోయి పడుకున్నాడు. నిద్దర్లో వాడు చొంగ కార్చటం ఆమె అనేకమార్లు చూసింది. ఛ! చిన్న పిల్లల మాస్టరు! వాడి వైపు చూస్తుంటే ఆమెకు ఎక్కడలేని ఆవేశం యెత్తుకొచ్చింది. నెత్తిమీదకైతే ఏళ్ళొచ్చాయి గాని కుటుంబానికి ఎందుకూ కొరగాకుండా పోయాడు. భర్త జీవించి వున్నంత కాలం మనోవ్యథలపాలు కావటానికి వీడే కారణం! తను పడాల్సిన కష్టాలన్నిటికి వీడే కారణం. తన బాధలు, కష్టాలన్నిటికి బాధ్యత వాడి నెత్తినవేసి ఏవగించుకున్న మహాలక్ష్మికి మరో అరగంట పోయింతర్వాత వాడిమీద ఎక్కడలేని జాలి పుట్టు కొచ్చింది. "వాడ్ని అనవసరంగా నిందించాను. వాడికి భగవంతుడు తెలివితేటలు ప్రసాదించ లేదు. వాడేం చేస్తాడు? వాడ్ని అసహ్యించుకోవటంలో తను పొరబాటు

# సమాచారమ్

## 21వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలు

1988వ సంవత్సరానికిగాను జనవరి-ఫిబ్రవరి నెలల్లో వై.ఎమ్.సి.ఎ. ప్రోత్సాహంతో హైదరాబాద్ నవ్యనాటక సమితి ఈ పోటీలను 16 నుంచి 30 ఏళ్ళ వరకు 'సీనియర్స్' విభాగంలో, 10-16 ఏళ్ళ వయస్కులకు 'జూనియర్స్' విభాగంలో, 6-10 ఏళ్ళ వయసు వారికి 'సబ్-జూనియర్స్' విభాగంలో నిర్వహించనున్నది. పోటీ నిబంధనలు, సిలబస్‌లతో పాటు ఎంట్రీ ఫారాలను వై.ఎమ్.సి.ఎ., నారాయణగుడా, హైదరాబాద్-500 029, లేదా నవ్య నాటక సమితి, 1-8-522/12, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020 నుంచి పొంద వచ్చు. దరఖాస్తులు చేరేందుకు ఆఖరు తేదీ డిసెంబరు 20.

## కళా దర్బార్-తాతాజీ యువ కవితల పోటీ ఫలితాలు

రాజమండ్రిలోని కళాదర్బార్ తాపీ ధర్మారావు శత జయంతి సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలలో తిరువూరు వాస్తవ్యులు శ్రీమతి కొండేపూడి నిర్మల (కవిత 'క్విక్ మెయిల్ సర్వీస్') ప్రథమ బహుమతి బంగారు పతకం, షీల్డు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిని ఆచార్య భావన్, విజయనగరం, శ్రీ కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కొసగి మూడవ బహుమతిని అందు కోగా, సర్వశ్రీ కడియం త్రినాథస్వామి, యాదగిరి, కొల్లూరి మెరిట్ బహుమతులు పొందారు. కుమారి ఎమ్. 'విశాలాక్షి, కోపుల వెంకటేశ్‌గార్లకు ప్రత్యేక బహుమతులు లభించాయి. తాపీ ధర్మారావుగారిపై రచనలకు శ్రీ శిడగం దొరయ్య (ఆత్రేయపురం), శ్రీమతి మండలీక భానుమతి (కాకినాడ), శ్రీ. టి.వి.ఎస్. రామానుజరావు (తిరువూరు) వరుసగా మొదటి, రెండవ, మూడవ బహుమతులు గెలుపొం దారు. రాజమండ్రి రచయితల విభాగంలో సర్వశ్రీ సాధనాల వెంకటస్వామినాయుడు, చందన కేదారేష్, శ్రీకృష్ణ దాసరి బహుమతులు గెలుపొందారు.

## సాహితీవేత్తలకు 'రచన' నివాళి

డాక్టర్ విద్వాన్ విశ్వం, డాక్టర్ దాశరథి, తుమ్మల వెంకట్రామయ్యగార్ల స్మృతికి ఇటీవల మద్రాసు 'రచన' ఆధ్వర్యాన డాక్టర్ బెజవాడగోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. సర్వశ్రీ ఎం.ఎస్. రెడ్డి, బి.ఎస్.ఆర్. కృష్ణ, శ్రీమతి మాలతీ చందూర్, డి. ఆంజనేయులు, డాక్టర్ పప్పు వేణుగోపాలరావు, డాక్టర్ జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ఈ సంతాప సభలో ప్రసంగించారు.

బయటపడిందేకాని వాడి తప్పేమీ లేదు. ఆ ముగ్గురు పసిపిల్లలూ వాడూ ఒకటే" అనుకుంది.

"తన కడుపుకు తిన్నా తినకపోయినా పిల్లల చదువులు మాత్రం మానిపించకూడదు. ఆఖరికి అవసరం అయితే ఏ స్థితికన్నా దిగజారి వాళ్ళను చదివించాల్సిందే."


ఆమెకో ఆలోచన తట్టింది.

"ఓ మిషను కొనుక్కొని బట్టలు కుడితే రోజులు హాయిగా వెళ్ళవచ్చు. తనకి మిషను మీద బట్టలు కుట్టటం అలవాటు వుంది. ఈ ఆలోచన ఆమెకు దివ్యంగా తోచింది. అయితే అందుకూ చాలా డబ్బు కావాలి. రెండు మూడొందలైనా కావాలి. అంత డబ్బు ఎక్కడ్నించి వస్తుంది? తన వంటిమీద చిన్న మెత్తు బంగారం లేదు. ఊరంతా అప్పులు పేరుకుపోయి వున్నాయి.

ఇన్నాళ్ళనుంచి ఈ ఊళ్ళో వుంటున్నారుగదా-ఆ మాత్రం సహాయం ఎవ్వరూ చెయ్యరూ? కరుడుకట్టుకు పోయాయా? ఇలాంటి వాళ్ళు రాక పోయినా తనకి విచారం లేదు" అనుకుంది మహాలక్ష్మి.

"అమ్మా, ఉత్తరాలు వచ్చాయి" అంటూ పెద్ద కొడుకు గదిలో ప్రవేశించగానే ఆమె ఆలోచనల్లోంచి తెప్పరిల్లి అందుకుని చదవ నారంభించింది.

అన్ని ఉత్తరాలు ఒకే మోస్తరుగా వున్నాయి. "రామ నాథానికి జబ్బుగా వుందని తెలిసి చాలా విచారించాం. భగవంతుడు మేలు చేస్తే ఆరోగ్యం కోలుకుని ఈపరికి కులాసాగానే వుంటాడని ఆశిస్తున్నాం. బయలుదేరి రావా లని ఎంత ప్రయత్నించినా అనివార్య కారణాలవల్ల రాలేకపోయాము. చాలా విచారిస్తున్నాం" మహాలక్ష్మి ఉత్తరాలన్నీ కోపంగా చించి అవతల పారేసింది. ప్రపం చంలో ఎంతమంది లేరు. వీళ్ళూ వాళ్ళలో ఒకరు. అన్నీ తేనె మాటలు- ఇక వాళ్ళ గురించి ఆలోచించటం ఆమెకు మనసొప్పలేదు. లోపల ఏదో తెలియని కసిగా, బాధగా వుంది. రాత్రి తట్టిన ఆలోచన మళ్ళీ స్ఫురణకు వచ్చింది. దానికోసం ఎవరితో సంప్రదించాలా అని




అప్పటికే తెలతెలవారుతూంది. ఆమె కళ్ళు తెరిచి చూసేసరికి సన్నటి ఎండ చార తన పాదాలమీద పడింది. పిల్లలు కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చు న్నారు.

** ** **

బాగా పొద్దెక్కేవరకూ ఎదురు చూసి చివరికి ఆఖరి బస్సు కూడా వెళ్ళిం తర్వాత "ఎవరూ రాలేదుగా సంచ యనం పూర్తిచేయించండి" అని బతిమలాడింది- అందు కయే ఖర్చు ఆమె వాళ్ళ చేతిలో పెట్టి.

ఆ కర్మ పూర్తయేసరికి చాలా పొద్దుపోయింది.

మహాలక్ష్మి గదిలో కొంగు పరుచుకుని పడుకుని ఆలోచిస్తూంది. "పచ్చగా సంసారం ఉన్నన్నాళ్ళూ అంతా అరమరికలు లేకుండా వచ్చి పోయే చుట్టాలు, ఇప్పుడెందుకు రాలేదు? వీళ్ళందరిలోనూ ఇంత మార్పు ఎందుకు వచ్చింది? ఎవరి మటుకు వారు ఈ దిక్కు మాలిన వాళ్ళ బాధ్యత ఎవరి నెత్తిన పడుతుందోనని జంకారు. ఆ విషయం స్పష్టంగా తెలుస్తూనే వుంది" ఆమెకు ఉద్రేకం వచ్చింది. "వీళ్ళ హృదయాలు

ఆలోచించింది. వెంకయ్యగారిని అడిగి ప్రయోజనం లేదు. డబ్బుకి ప్రాణానికి లంకె. ఆయన పెదవి విరుస్తే తనకి వచ్చే సిగ్గు వేస్తుంది. పోనీ రాజయ్యగారితో ప్రస్తావిస్తే? ఈ ఆలోచన బాగానే వున్నట్టు తోచింది.

పెద్ద కొడుకుని పిలిచి రాజయ్యగారున్నారేమో కను క్కురమ్మని పంపించింది.

కాసేపు పోయింతర్వాత వాడు వచ్చి "ఆయన పట్నం వెళ్ళారుట" అన్నాడు.

"ఎప్పుడు వస్తాడుట" అంది మహాలక్ష్మి సగం కృంగిపోయి.

"పదిహేను రోజులవరకూ రారుట" అన్నాడు.

క్షణం సాలోచనగా ఆగి "పోయి రామయ్యగారిని పిలుచుకురా. అమ్మ మరీ మరీ చెప్పింది అని చెప్పు" అంది మహాలక్ష్మి.

కొడుకు వీధిలోకి పరుగెత్తాడు. ఎండ తీవ్రత తగ్గి చల్లగాలి తిరిగింది. వీధిలోంచి ఏ సందడీ ఆమెకు వినిపించటం లేదు.

"పిల్లలు ఎక్కడికి వెళ్ళినట్టు? అమ్మాయ్!

అమ్మాయ్!'' సమాధానం రాలేదు. దూరంగా బడి గంటలు వినిపించాయి. వీథిలో సైకిళ్ళ ధ్వనులు మందగించాయి. గోదావరిమీంచి పడవవాళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి. దొడ్డిలో కాకుల గోల. మనసులో గుబులు గుబులుగా వుంది మహాలక్ష్మికి. ''రామయ్యతో ఈ సంగతి ఎలా ప్రస్తావించాలో? ఏమంటాడో?' అనుకుంటూందామె.

''అమ్మా, రామయ్యగారొచ్చారే'' అంటూ జారిపోతూన్న లాగూ పైకి ఎక్కలాక్కుంటూ వచ్చాడు.

ఆలోచనల్లోంచి తెప్పరిల్లి దుఃఖమలినమైన ముఖాన్ని తుడుచుకుని తలుపు వార నిలబడి మనసులో వున్నది చెప్పటానికి తటపటాయిస్తూ, చివరికి తెగించి ''మీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలని పిలిపించాను. మా పరిస్థితులు మీకు తెలియంది కాదు. ఇక ఈ కుటుంబ బాధ్యతంతా నేనొక్కత్తినీ భరించాలి. ఎలా నిభాయిస్తానో ఏమిటో నాకు అయోమయంగా వుంది'' అంది కంపిత స్వరంతో.

రామయ్య చలించాడు. జాలిగా నిట్టూర్చి ''నేనూ అదే ఆలోచించానమ్మా-నాకూ పిల్లా జల్లా గంపెడు సంసారం. రెక్కాడితే డొక్కాడుతుంది. నాకు చేతనైనంత వరకూ సహాయం చెయ్యగలను. అందుకు వెనకాడే వాణ్ని కాను''

''మీ పరిస్థితులు నాకూ తెలుసు. అందుకే మిమ్మల్ని రమ్మనమని కబురు పంపించాను. పెద్ద పెద్ద వాళ్ళని ఇంటికి పిలిపించుకుని మాట్లాడే చనువూ, అంతస్థులూ మాకు లేవు. మీకూ, వారికీ వున్న స్నేహం కొద్దీ చొరవ చేసి పిలిపించాను. ఏమీ అనుకోకండి'' అంది మహాలక్ష్మి రుద్ధ స్వరంతో.

రామయ్య అనునయ స్వరంతో ''ఫర్వాలేదు మీ మనసులో వున్నదేదో చెప్పండి'' అన్నాడు.

''బట్టలు కుట్టుకుని కాలక్షేపం చేయాలని వుంది. మెషను కొనాలని అనుకుంటున్నాను. రెండు మూడొందలైనా కావాల్సి వుంటుంది. ఎక్కడైనా అప్పుగా ఇప్పిస్తే...''

రామయ్య అడ్డుపడుతూ ''నేనూ అదే సూచిద్దామనుకుంటున్నాను. ఇంతలో మీరే ఆ ప్రస్తావన తెచ్చారు.''

''మీ అభిమానం, అంతస్తు అలాంటిది.''

''రామనాథంగారు ఈ ఊళ్ళో పాతిక సంవత్సరాల నుంచి నౌఖరీ చేస్తున్నాడు. వెనక ఆధారం ఏమీ లేదన్న సంగతి ఈ ఊళ్ళో అందరికీ తెలుసు. ఇప్పుడిటువంటి అవాంతరం వచ్చింది కాబట్టి నలుగురూ ఆదుకోవటం ధర్మం. నలుగురితోనూ ఈ సంగతి నచ్చచెప్పి ద్రవ్య రూపంలో మీకు కొంత ముట్టచెప్పాలని నేననుకున్నాను. భగవంతుడి కృపవల్ల నా ప్రయత్నం సానుకూలమవుతుందనే నమ్మకం నాకుంది. అయితే మీ అభిప్రాయం తెలుసుకోకుండా రంగంలోకి దిగటం భావ్యం కాదని వెనకాడుతున్నాను'' అంటూ సాభిప్రాయంగా ఆమెవైపు చూశాడాయన.

మహాలక్ష్మి పొంగి వస్తున్న దుఃఖాన్ని అణచుకుని ఆత్మాభిమానాన్ని వెనక్కి నెట్టి ''మీ ఇష్టం'' అంది.



అమలాపురంలో ఇటీవల 'త్రివేణి' సంస్థ ఆధ్వర్యాన లలిత సంగీత కచ్చేరీ చేసిన శ్రీమతి ఇంద్రగంటి జానకీబాలను సత్కరించిన శ్రీమతి నంబూరి ఉషారాణి.

''అయితే నే వెళ్ళొస్తా'' అంటూ రామయ్య వెళ్ళిపోయాడు.

మహాలక్ష్మమ్మ మనసుకి కొంత ఊరట కలిగింది. ఈ ధర్మాత్ముడికి వెయ్యి నమస్కారాలు పెయ్యాలని మనసులో ఆమెకు అనిపించింది. ఆ రాత్రి ఆమెకు సుఖంగా నిద్ర పట్టింది. తెల్లవారి లేచేసరికి సూర్యుడు అప్పుడే ఉదయిస్తున్నాడు. ఆమె పెరట్లోకి నడిచింది. పిల్లలింకా లేవలేదు. పెరడంతా కసువు వూడ్చి కుంపట్లో నిప్పేసి వీథి గదిలో కొచ్చేసరికి పిల్లలు నలుగురూ వీథి అరుగుమీద కూర్చుని ముఖం కుడుక్కుంటున్నారు.

కొద్దిసేపు పోయింతర్వాత పెద్ద కూతురు దగ్గరకొచ్చి ''అమ్మా నేనూ, చెల్లి, తమ్ముడు ముగ్గురం బళ్ళోకి పోవద్దే'' అంది ప్రాధేయపడుతూన్నట్టుగా.

''అలాగే. రెండు రోజులు పోయింతర్వాత పోదురుగాని'' అని సముదాయించింది మహాలక్ష్మి.

పిల్లలు రోడ్డు కడ్డంపడి ఆటలు ప్రారంభించారు.

నిత్యకర్మ ప్రారంభించటానికి పదీ అయింది. ఎరుగున్నవాళ్ళా నలుగురూ వచ్చి కూర్చున్నారు. మహాలక్ష్మి పెరటి గుమ్మానికి చారబడి చాటుగా కూర్చుంది. వాళ్ళ తతంగం కొంత వరకూ అక్కడికి కనిపిస్తూంది. అగ్ని హోత్రం లోంచి లేచే పొగ సుళ్ళు తిరుగుతూ ఆకాశంలో కలిసిపోతూంది. ఆమె ధ్యాస ఎక్కడికో పోయింది. ఆమెకు వుండి ఉడిగీ అక్కడి వాళ్ళ మాటలు, మంత్రోచ్చారణ కలగాపులంగా స్పష్టాస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఏదో ఎక్కడో దూరాన్న జరుగుతూన్నట్టుగా వుంది.

పొద్దు నడినెత్తిమీదికొచ్చింది. శీతాకాలపు ఎండ వీపులు మాడుస్తూంది. పిండాలు ఎత్తుగా గోడమీద పెట్టి అంతా ఆ చుట్టుపక్కలే నిలబడ్డారు.

రెండు కాకులు ఆ దరిదాపులదాకా రావటం, తిరిగి ఎగిరిపోవటం జరుగుతూ వచ్చింది. సెకన్లు, నిమిషాలు, గంటలు గడిచిపోతున్నాయి. నడినెత్తిన గునపం పోటులాగుంది ఎండ తీవ్రత.

ఒక పెద్దమనిషి ఇవతలకి వచ్చి ''ప్రేతాత్మ కేదో అసంతృప్తిగా వుంది. ఆయన అభిమతాలకి, ఆశయాలకి విరుద్ధంగా ఏదైనా జరిగివుండాలి. లేకుంటే ఏమైనా కోరిక లున్నాయేమో!'' అన్నాడు.

''అవును. అంతే అయివుంటుంది'' అంటూ మరొకరు ముందుకొచ్చారు. చివరికి గుసలు గుసలు ఎక్కువై సలహాలు, ఆదేశాల్లోకి దిగింది వ్యవహారం.

కుర్రవాణ్ణి మనసులో ఏదైనా అనుకుని దండం పెట్టుకోమన్నారు.

''నేను బుద్ధిగా చదువుకుంటా'' అని దండం పెట్టుకున్నాడు.

''ఉహూ! లాభంలేదు'' అన్నారు నలుగురూ.


ఆఖరికి విషయం మహాలక్ష్మి చెవినికూడా పడింది. ఆమె ''ఏమీ అపచారం చెయ్యలేదే'' అంది కన్నీరు కారుస్తూను.

''కాదు. ఏదో జరిగివుండాలి'' అంది ఓ గొంతు.

మహాలక్ష్మికి రామయ్య చెప్పింది జ్ఞాపకి వచ్చింది. పైకి చెప్పటానికి సంకోచించింది. భర్తకి తను యిలా నలుగురి దయా ధర్మాల మీద జీవించటం యిష్టం లేదా? తనిలా గర్భ దరిద్రంతో కడుపులు మాడ్చుకుంటే ఆయనకి సంతృప్తి అని బుజావు చెప్పటానికి వీళ్ళు ప్రయత్నిస్తున్నారా?

''రామయ్యగారు ఏదో నలుగురితోనూ సంప్రతించి ద్రవ్య రూపంలో మీకేదో ముట్టచెప్పాలని అనుకుంటున్నారట నిజమేనా?'' అన్నాడొకడు.

''నిజమే'' అంది మహాలక్ష్మి మెల్లగా.




"అదీ సంగతి. మరి చెప్పరేం. రామనాథం యెంత గౌరవంగా బ్రతికాడు! ఒక్కనాడు ఒక్కళ్ళ ముందు చెయ్యి చాపిన సందర్భం వుందా? ఇలా పందాలు వసూలు చేయడం ఆయనకెంత అప్రతిష్ఠ! అందు కాయన ఆత్మ ఎంత క్షోభిస్తుందో. వెంటనే ఈ సంకల్పం విరమించుకుంటే ప్రేతాత్మ సంతృప్తి చెందు తుందేమో..."

మహాలక్ష్మి నిలువునా కృంగిపోయింది. "ఒకవేళ తనీ మాట అనగానే కాకతాళీయంగా ముట్టుకోవటం జరిగితే తనీ కాస్త ఆధారాన్ని వదులుకోవాల్సిందేనా? ఆయనకి యిష్టం లేకుండా ఎందుకుంటుంది? ఈ పిల్లలు జల్లలు ఏమయిపోతారు అని ఆయన మాత్రం ఎంత బాధపడే వారు? అయినా తను నోటి మట అన్నంత మాత్రాన అవి ముట్టుకుంటాయేమోనని తను భయపడటం దేనికి? తన కటువంటి నమ్మకం లేదు" అయినా ఆమెకేదో అదటుగానే వుంది. ఒకవేళ అవి అప్పుడే వచ్చి ఎగబడితే ఎలా?

చివరికి గుంపులోంచి గుసగుసలూ, నిందాగర్భిత మైన, బాధ్యతా రహితమైన మాటలు వినవస్తున్నాయి. ఆమెకి ఈ పరాయివాళ్ళ వత్తిడి ఎక్కువయింది. చివరికి తెగించి 'ఇంతటితో ఈ సంకల్పం విరమించుకున్నాను' అంది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

మరో అయిదు నిమిషాలు గడిచాయి. అంతా అక్కడి నించి కదిలి వరండాలోకి వచ్చి నిలబడ్డారు. నలుగురూ దూరంగా తప్పుకోగానే అంతవరకూ భయం భయంగా దూర దూరంగా ఎగురుతున్న కాకులు పిండాలమీద కలియబడి మరు నిముషంలో నిశ్శేషంగా పొట్టని పెట్టుకుని అరుచుకుంటూ ఎగిరిపోయాయి.

అంతా యెవరికి తోచినట్టు వాళ్ళు వ్యాఖ్యానించారు.

"నే చెప్పలేదండీ; రామనాథం ఎంత గౌరవంగా బ్రతికాడు. ఇటువంటివి హర్షిస్తాడా?" అని వ్యాఖ్యానిం చారు యింకొకరు.

మరు నిమిషంలో ఈ వార్త ఆ వీధి వీథంతా పాకిపోయింది.

రామయ్య హతాశుడై గుమ్మంలో చతికిలబడి 'పాపం దురదృష్టవంతురాలు' అనుకున్నాడు. అంతటితో అతనూ ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

పెరటి గుమ్మం దగ్గర నిలబడ్డ మహాలక్ష్మి ఎప్పుడో సొమ్మసిల్లినట్టుగా కూలబడిపోయింది. ఆమెకు ఒంటి మీద స్మారకం వున్నట్టు లేదు.

అంతా ఎవరి యిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు. నలుగురు పిల్లలు ఒకళ్ళ ముఖంలోకి ఒకళ్ళు బితుకు బితుకుమని చూస్తూ సొమ్మసిల్లి పోయిన తల్లి చుట్టూ కూర్చున్నారు.

— 'ఆంధ్రజ్యోతి' మాసపత్రిక నుండి.

'జెట్' ఇంటికి తెండి, దోమలను బయటకు తరమండి.



జెట్ దోమలను పారద్రోలితే పొందండి నిద్ర సుఖం.

పొగ వస్తుందనే బాధలేదు. బూడిద రాలుతుందనే సమస్యలేదు. అశుభ్రత అనే మాటేలేదు. మరెలాంటి బాదరబందీలేదు. బటన్ అలా నొక్కితే చాలు. సువాసనలు వెదజల్లుతూ జెట్ పనిచేయటం మొదలెడ్తే. హాయిగా నిద్ర పొంది "జెట్" తక్షణం దోమలను తరిమివేసే విద్యుత్ ఉపకరణం. జపాను దేశపు సరికొత్త సాంకేతికతతో తయారు చేయబడినది. ఇది దోమలను వెంటనే తరిమివేసే, ఆధునిక కాలపు ఒక శుభ్రమైన పద్ధతి.. ప్రభావవంతం, మితవ్యయకరం. దోమలను తొలగిస్తుంది తక్షణం. మరి నేడే జెట్ తెండి. దోమలను వెంటనే తరిమి వేయండి.
జెట్ మస్కిటో రిపెల్లర్

తయారు చేయువారు :
ప్లాస్టోమెక్స్ (ఇండియా)
38, పటేల్ నగర్,
ఇండోర్–452 004.
ఫోన్ : 60507.

Jet

Bidhan-PL-11-Tel